# శ్రీ రమణ జ్యోతి
అక్టోబర్ 2018

# Sri Ramana Jyothi
October 2018

ఈ సంచికలో ...

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.యస్. గారి 53వ ప్రసంగం | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | శ్రీదేవి కాలోత్తర జ్ఞానాచార విచార పటలము | ముదిగొండ వీరభద్రయ్య | 12 |
| 3. | అరుణాచల జ్యోతిర్గమనం | వంగర శ్యామసుందరి | 17 |
| 4. | శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు | కాట్రావులపల్లి సుబ్బలక్ష్మి | 25 |
| 5. | **Bhagavan Ramana: His Silent *Upadesa* (Part-1)** | Arthur Osborne | 30 |
| 6. | **Lord Krishna's Recipe For Happiness** | Dr. K. Subrahmanian | 35 |
| 7. | **Sri Bhagavan and Ahimsa** | V. Krithivasan | 39 |
| 8. | **Vision of Siva At Mt. Kailash** | Sivani | 46 |
| 9. | **In The World, But Not of The World The Story of Kaduveli Siddhar** | | 49 |


## Events in Sri Ramana Kendram in October

1. 9.00 am to 10.45 Satsang every Sunday
2. 3rd Sunday - Meditation
3. 3rd October - Punarvasu Satsang - 6.00 - 7.15 p.m.

శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)


**Editorial Board:** Telugu: **Dr. V. Ramadas Murthy, Malladi Phanimala, Katravulapalli Subbalakshmi**
English: **V. Krithivasan, N.S. Ramamohan, Sneha Choudhury**

# భగవంతుని వశమైతే సమస్యలు ఉండవు

ఆంగ్ల మూలం: డా॥ కే.యస్. గారి 53వ ప్రసంగం

తెలుగు అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

## భగవంతుని కోసం తాపత్రయం

ఎందుకు దేవుడు మనకు తగినంత శక్తిని ప్రసాదించడం లేదని మనం పలుమార్లు అనుకుంటాం. ఇతరులతో అదే చెప్పుకుంటాం కూడ. నేను దైవపూజ చేస్తాను, ఆయన్ను తలచుకొంటాను, ప్రేమిస్తాను. అయినప్పటికి పరిస్థితి ఎందుకు ఇలా ఉందని వాపోతాము. ఇక్కడ మనం తెలుసుకోవలసినది ఏమిటంటే, మనం యథార్థానికి దేవుడిని ప్రేమించడం లేదు. ఈ ప్రపంచం లోని వస్తువులను, భార్య, పిల్లలు, ధనం, ప్రతిష్ఠ, వీటిపై మక్కువ చూపినప్పుడు, దేవుడిని గురించి ఏ కొద్ది సేపో, ఒక పది నిమిషాలు ధ్యానం, లేదా జపానికి పరిమితమై వుంటుందన్న మాట. ఆయనను తలచుకొంటున్నామని అనుకొంటాముగాని, అది నిజం కాదు. ఆ కొద్ది సేపు తలచుకొంటున్నప్పుడు కూడ మనసు బయటి విషయాలపై దృష్టి పోనిస్తుంది. గురువు విషయంలో కూడ మనం కోరుకొంటున్నది లభించినంత కాలం బాగుంటుంది. అలా కాకపోతే వేరే గురువును వెదకుతూ వెళ్తుంటాము. లౌకిక విషయాలను ప్రేమిస్తున్నంత మేరకు దేవుడిని ప్రేమించడం లేదని గుర్తించాలి.

పిల్లలు, ధనం మొదలైన వాటి కోసం ఆరాటపడినంతగా భగవంతుని కోసం తాపత్రయపడేవారు ఎవ్వరని భగవాన్

అడుగుతారు. మునులు, ఋషులు, జ్ఞానులు దేవుని కోసం ఎంతో ఆరాటపడి మరి దేనినీ కోరరు. కొన్ని సందర్భాలలో దేవుడు అసలు వున్నాడన్న నమ్మకమే సన్నవాఋతుంది. పెద్ద కష్టాలు ఎదుర్కొంటున్నప్పుడు, అవి ఎందుకు రావాలి, నాకు ఒక్కడికే ఎందుకు కలుగుతున్నాయని చింతిస్తాము. దానికి పూర్తిగా సంతృప్తి కరమైన సమాధానం ఇవ్వలేము. దేవునిని ఎంత మేరకు తలచు కొంటామో అంతేమేరకు మనకు ఊరట లభిస్తుంది.

అందరమూ మానసిక ప్రశాంతతను కోరుకొంటాం. అయినప్పటికి, ప్రొద్దుటి నుండి రాత్రి వరకు ఉద్యోగం గురించిన చింత, కుటుంబ బాధలు, ఇలా ఎన్నో ఆలోచనలు వస్తూనే వుంటాయి. అలాంటి పరిస్థితుల్లో, నేనెందుకు బాధపడాలి, దేవునికి తెలుసు నాకు ఏది మంచిదన్న విషయం. జరిగినదానికి, జరగబోయేదాని గురించి మనం ఏమీ చేయలేము అన్న ధోరణి ఏర్పడితే, బరువు తప్పక తగ్గుతుంది. కాని నేను దేవునిని ప్రేమించడం ఆయన తలచుకొంటే తప్ప జరగదు, అన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఇది చాలా ముఖ్యం.

సాధారణంగా ఒక గురువు వద్దకు వెళ్ళినప్పుడు ఏదో ఆశించి వెళతాం. ఇక వెంకటేశ్వర స్వామిని దర్శించినప్పుడు రెండు, మూడు లక్షల ధనం వస్తే, పదివేలు లేదా యాభైవేలు సమర్పించుకొంటా మని మ్రొక్కుకొంటాం. అదే మహర్షి దగ్గరకు వెళితే డబ్బును గురించి మాట్లాడం. అలాంటివి ఇతరులనుండి విన్నప్పుడు మనమూ అలా నడచుకోవాలి అన్న ఊహ కలుగుతుంది. అన్నిటి

గురించి ఆందోళన పడనవసరం లేదు. ఏది లభించాలని వ్రాసి వుంటే అది తప్పక లభిస్తుంది అని అనుకొని వుండవచ్చు. కాని తరచు దేవుని శక్తినే ప్రశ్నిస్తాము. శ్రీరాముడు అంత గొప్ప దేవుడై నప్పటికి, అయోధ్యలో తన మంచితనాన్ని కాపాడుకోలేక పోయాడు. అసలు దేవుడున్నాడా అని అనుమానం వ్యక్తం చేయడం జరుగుతుంది.

దక్షిణేశ్వర్‌లోని కాళికామాత గుడిలో ఒకసారి దొంగలు విగ్రహం మీది ఆభరణాలను దొంగిలించారు. కొందరు రామకృష్ణ పరమహంసతో, ఆమె ఏమి దేవత? విశ్వమాత అంటారు. ఆమె నగలను దొంగల నుండి కాపాడుకోలేక పోయిందని ఎగతాళిగా మాట్లాడారు. దానికి రామకృష్ణులు జవాబిస్తూ, ఆ నగలు కావాలని ఆమె అడిగిందా? మీరు మీ ఇష్టం కొద్ది ఆ ఆభరణాలను వేశారు. ఆమె మటుకు వాటి గురించి పట్టించుకోలేదు. వాటిని తనవిగా గుర్తించలేదు. మీరు బంగారానికి, విలువ కడతారు కాబట్టి అవి దొంగిలింపబడ్డాయని బాధపడుతున్నారు. ఆమెకు ఏ బాధ లేదు. నగలు, మట్టిముద్ద రెండూ ఆమెకు సమానమే అన్నారు.

**హృదయం ఎటు?**

దేవుడు అన్నిచోట్ల ఉన్నాడంటారు. మనం ఈ విషయాన్ని నమ్ముతాం, కాని దాన్ని అనుభవించడం అరుదు. భగవాన్ నీవే దేవుడన్నారు. శంకరభగవత్పాదులు చిదానందరూపా, శివోహం, శివోహం అన్నారు. నేనే శివుడని భావన. దానిని మళ్ళీ మళ్ళీ

నెమరువేసుకోవచ్చు. కాని అది అనుభవమౌతుందా? అదే ధ్యాస వున్న కొన్నాళ్ళు కొంత సంతృప్తి వస్తుందేమోకాని నిజంగా అనుభవం లేనంత కాలం మనసు అటూ, ఇటూ ఊగిసలాడు తుంటుంది.

భగవాన్ మాత్రం అనుభవం పొందినప్పుడు ఈ విశ్వమంతా భగవంతుడేనన్నది ఏకైక సత్యమంటారు. శ్రీసత్యసాయిబాబాను, మీరు దేవుడంటారు కదా, ఎలా చెప్పగలుగుతున్నారు, అని అడిగారట. ఆయన ఏమీ అనుమానం లేదు, నేను దేవుడినే. కాని తెలుసా, నీవు కూడ దేవుడివే, నేను దానిని అనుభవించాను, నీవు అనుభవించడం లేదు అని బదులిచ్చారట.

ఆత్మ అన్నిటికంటే ముఖ్యమైనదని మహర్షి అన్నారు. ధ్యానం ఎలా చేయాలి? ఛాతీలో ఎటువైపు కేంద్రీకరించాలి? కుడివైపునా? ఎడమవైపునా, అని అడిగారు మహర్షిని. ఎవరో రెండు కనుబొమల మధ్యస్థానంలో దృష్టి నిలపాలని, మరికొందరు ముక్కు చివర కేంద్రీకరించాలని, మరికొందరు ఇష్టదైవాన్ని స్మరించుకొని చేయాలని అంటారని, అడిగారు. భగవాన్ మాత్రం ఛాతీలో కుడివైపున ధ్యానం నిలపాలని, ఆధ్యాత్మిక హృదయం అటువైపు, భౌతికమైన గుండె ఎడమవైపు వుంటాయన్నారు. భగవాన్ ఎందుకు అలా అన్నట్లు? అలాంటి ప్రశ్న అడిగినప్పుడు ప్రశ్నించినవారు ఆత్మను శరీరపరంగా ఆలోచిస్తున్నారు. శరీర ధ్యాస ఇంకా పోలేదు. ఆ దశను అధిగమించడం చాలా కష్టం.

మనసు గురించి ఆలోచిస్తున్నప్పుడు, మనసు శరీరం లోపల

వుందనుకొంటాము. అలాగే, ఆత్మ శరీరంలో వుందని లోపలివైపు కేంద్రీకరిస్తాము. మనసు ప్రతిచోట లేదు. ఆత్మ అన్ని చోట్ల వుంది. మరి ఆత్మ అన్ని చోట్ల వున్నప్పుడు అది లేని చోటు ఎక్కడైనా వుందా? లోపల, బయట, అని అంటున్నప్పుడు, మనం శరీరాన్ని ఉద్దేశించి చెబుతున్నామన్న మాట. ఆత్మ అన్నిచోట్ల వుందని చెప్పబడినప్పుడు, ఆత్మ శరీరంలోనే లేదని, శరీరం ఆత్మలో వుందని తెలియవస్తుంది. శరీరం లేకుండపోతుంది, కాని ఆత్మ అలాగే వుంటుంది. దానిని అవగాహన చేసుకొనేందుకు శరీర ధ్యాస వుండరాదు. ఇంకా ఆ దశ చేరనివారి కోసం భగవాన్ అలా ఛాతీ యొక్క కుడివైపు ధ్యానాన్ని కేంద్రీకరించమని చెప్పారు. ఇలాంటి ఇబ్బందులు ఏర్పడతాయన్న ఉద్దేశంతోనే ఆత్మవిచారణ మెరుగైన మార్గమన్నారు. అది కూడ వీలు కానప్పుడు సంపూర్ణ శరణాగతి ఏకైక మార్గమన్నారు. ఈ రెండింటిలో ఒక దానిని అభ్యసించి నప్పుడు నీవే ఆత్మ అని బోధపడుతుందని చెప్పారు.

**శరణాగతి**

శరణాగతి అత్యంత ఉన్నత స్థాయి సాధన. అంటే ఏమిటి? భగవంతునికి అన్ని విషయాలలో ఆయన ఇష్టం, నిర్ణయాలలో ఆయనదే పై చేయిగా వుండాలని పూర్తిగా నమ్మకం ఉంచడం. ఏ కోరికలు వెలిబుచ్చకుండ నీ ఇష్టమే నా ఇష్టమని చెప్పడం. ఇది కూడ కష్టమైనదే! మంచి జరిగినప్పుడు సంతోషంగా అంగీకరిస్తాం, కానప్పుడు బాధపడతాం. కాని ఆత్మవిచారణ జరిపిన తరువాత అత్యంత మానసిక ప్రశాంతత లభిస్తుందన్నది నిజం.

అయితే, తరచు భగవంతుని పట్ల నమ్మకాన్ని ప్రకటితం చేస్తూనే వుండాలి. నిన్ను నమ్ముతాను, తలచుకొంటూనే వున్నాను అని స్మరిస్తూనే వుండాలి. కాని బదులుగా ఇంకేదో ఇవ్వమనడం సబబు కాదు. అది ఒక వ్యాపార లక్షణమౌతుంది.

భగవాన్ కృపతో మనం వీలైనంతగా ఆయనను ధ్యానిస్తూ వుంటే, సమస్యల మధ్యలో వున్నప్పుడు కూడ అద్భుతమైన శాంతి లభిస్తుంది. అప్పుడు మన గురించి చింతపడం గనుక ఇతరులకు సంబంధించిన విషయాలు రంగంలోనికి వస్తాయి. అలాంటప్పుడు వాళ్ళను సంతోషపెట్టడానికి చేసే ప్రయత్నాలు మనకు సంతోషాన్ని ఇస్తాయి. మన కోసం చేసే ప్రయత్నాలు ఫలించక పోయినప్పటికి, ఇతరులకు ఏమీ ఆశించకుండ చేసిన సహాయం మనకూ సంతోషాన్ని ఇస్తుంది.

మహర్షి ఆనందంగా వుండడానికి ఇతరుల ఎవ్వరి సహాయం అక్కర వుండేది కాదు. ఆయన అపారమైన అనుభూతులతో తమకు ఈ తొందరలన్నీ ఎందుకని హిమాలయాలకు వెళ్ళి అక్కడ సౌఖ్యంగా వుండగలిగేవారు. కాని మన కోసం మహర్షి తీరు తమ స్థాయిని దిగివచ్చి, మన ప్రశ్నలకు సమాధానాలిస్తూ, తాము నివసిస్తున్న స్థలం యొక్క కట్టుబాట్లకు లోబడి, అందరికీ 24 గంటలూ అందుబాటులో వుంటూ గడిపారు. అదే మనమైతే ఒక గంటసేపు కూడ అలా నడుచుకోలేము. ఆయనే ఆనంద స్వరూపం గనుక మనకందరికీ పంచిపెట్టారు, పంచి బెడుతున్నారు.

భగవంతుడినే పూర్తిగా నమ్మినప్పుడు మనం వ్యక్తిగతంగా ఏ ప్రత్యేక ప్రయత్నాలు చేయనవసరం లేకుండ ఆనందాన్ని అనుభవించగలమని భగవాన్ చెప్పేవారు. మనం పరిమళ ద్రవ్యాన్ని వాడినప్పుడు చుట్టూ వున్నవారందరికీ ఆ పరిమళం హాయిని కలిగిస్తుంది. ప్రత్యేకించి సువాసనా ద్రవ్యాన్ని వాడామని ఇతరులకు చెప్పనక్కరలేదు. అదే వ్యాపిస్తుంది. అందుకే మన ధ్యానం, పూజ, భగవంతుని గురించిన ఆలోచనలు నిరంతరం చేస్తూ వుండి, బాధ్యతలు ఆయనపై వుంచితే, మన గురించిన ఆలోచనలు వుండవు. అహం నశిస్తుంది, ఆత్మపై ధ్యాస మాత్రమే మిగులుతుంది. సత్, చిత్, ఆనంద స్థితిలో వుంటాము. మనసు ఆత్మలో లీనమౌతుంది.

**గర్వాన్ని అణచాలి**

ఈ ప్రయత్నాలను చేయడానికి ముందు, మనం ఏదో ఫలానా దేవుడు లేదా గురువుగారి దాసుడు, భక్తుడినని చెప్పుకొనే ముందు ఆ మాట మనం కాదు, ఇతరులు అనగలిగే స్థాయికి చేరుకోవాలి. అలాంటి నమ్రత కలిగివుండాలి. శంకర భగవత్పాదులు, ప్రభూ! నా గర్వాన్ని పూర్తిగా అణచివేయమని ప్రార్థించారు. మనంతట మనమే ప్రకటించుకుంటే మన ప్రగతి కుంటుపడుతుంది. నిజానికి, నేను ఎందుకు ఇంత కంటే ఎక్కువ తరచుగా భగవద్ధ్యానం చేయలేక పోతున్నాని ఆలోచిస్తుంటే, ఆధ్యాత్మిక ప్రగతి, ఆనందం లభించే అవకాశం వుంది.

ఉద్ధవుడు శ్రీకృష్ణుని నిందించినంత పనిచేశాడు. తనకంటే ఏ మాత్రం గొప్ప వ్యక్తి కాదని భావించిన కుచేలునిని హృదయ

పూర్వకంగా కరుణించిన శ్రీకృష్ణుడు, తనను అలాగ ఎందుకు సరిగా చూడలేదని ఉద్ధవుని అభియోగం. కుచేలుడు చాలా పేదవాడు, తాను ఏమీకానని భావించేవాడు. తనకు ఏమీ కావాలని శ్రీకృష్ణుడుని అడగలేదు. ఆఖరుకు ఉపదేశం కూడ అడగలేదు. శ్రీకృష్ణుడు ఉద్ధవుని, కుచేలుని ఎలా ఆదరించాడు? కుచేలుని భార్య కావాలని ఆశించిన అన్ని భాగ్యాలను శ్రీకృష్ణుడు ప్రసాదించాడు.

మనం నిజం అనుకునేది నిజం కాకపోవచ్చు. ఉద్ధవుడు జ్ఞానివలె కనిపించేవాడు, కాని జ్ఞాని కాడు. ఉద్ధవగీతలో అతనికి ఏమి చేయాలి, ఏమి చేయరాదు అని శ్రీకృష్ణుడు బోధించాడు. కుచేలుడు తననే శ్రీకృష్ణునికి అర్పించుకున్నాడు. అలాగే గోపికలు కూడ తమ హృదయాలను శ్రీకృష్ణునికి సమర్పించుకున్నారు. వాళ్ళు చదువుకున్నవారు, పండితులు కారు. నాకు పాండిత్యంతో పనిలేదు. మీరు మీ హృదయాలను నాకు అర్పించారు. మీ సంపూర్ణ భక్తి తత్పరత వల్ల మిమ్మల్ని వదలిపెట్టడం నాకు చాలా కష్టంగా వుంది అన్నాడు శ్రీకృష్ణుడు. అంబరీషుని గురించి విష్ణువు కూడ అలాగే చెప్పాడు. అంబరీషుడు పుత్ర, ధన ధాన్యాలన్నిం టిని త్యజించాడు. నా భక్తులు సంపదను, భార్య, పిల్లలను అన్నీ త్యాగం చేస్తారు. వారేమీ అడగరు. అందుకే వారు కోరకుండానే అన్నీ ఇవ్వడం నా భక్తుల పట్ల నా విద్యుక్త ధర్మం. ఈ విషయంలో నాకు ఏ స్వాతంత్ర్యమూ లేదు, అది నా బాధ్యత అని అన్నారు. ఆ స్థితిని మనం చేరడానికి భగవంతుని కృప అవసరం. అప్పుడు ప్రతి ఒక్కటి దైవేచ్ఛగా భావిస్తాం.

తిరువణ్ణామలైలో మొదటిసారి తనను కలిసిన తల్లిగారికి కూడ భగవాన్ ఇదే సందేశమిచ్చారు. ఏది జరగాలని వుందో అది జరుగుతుంది. ఏది జరగరాదని విధి నిశ్చయించిందో అది జరగదు. ఊరక వుండడమే ఉత్తమం అన్నారు. ప్రతి ఒక్కరికి ఈ ప్రపంచం లో ఒక కార్యం నిర్ణయించబడి వుందని, శక్తివంచన లేకుండ దానిని నిర్వర్తించి, కర్మఫలాన్ని ప్రభువుకు వదలిపెట్టాలని చెప్పారు. మీకు లభించే శాంతిని మీ చుట్టు ప్రక్కల వున్నవాళ్ళు కూడ అనుభవిస్తారు.

శ్రీకృష్ణుడు భగవద్గీతలో “ప్రజాహాతి యథా కామాన్ సర్వాన్ పార్థ మనోగతాన్! ఆత్మన్యేనాత్మనా తుష్టిః స్థితప్రజ్ఞస్తదోచ్యతే” అన్నాడు. గొప్ప జ్ఞానులు తమ కోరికలను స్వతహాగా త్యజించి బయటి నుండి ఆనందాన్ని అన్వేషించరు. తమకు లోపల లభించే ఆనందంతో పరమ సంతుష్టులుగా వుంటారు. దేవుడు, గురువు, ఆత్మ, ఏ పేరుతో పిలిచినప్పటికి, అలా లభించే ఆనందంతో జీవితంలో ఎదురయ్యే సమస్యల ప్రభావం లేకుండ చేసుకుంటారు. ఆ స్థితిని మన తెలివితేటలు, శక్తి, ఆఖరుకు ప్రయత్నం కూడ లేకుండ దైవకృపతో చేరగలుగుతాం. ప్రభూ, చిన్న మనసుతో, అల్పుడనైన నేను అనంతాన్ని ఎలా అవగాహన చేసుకుంటాను, అని ప్రార్థించాలని శంకర భగవత్పాదులు అన్నారు. దానికి మార్గం ఒకటే! ఆయనే నా మనసులో ప్రవేశించి, నన్ను పూర్తిగా వశపరచుకోవాలి.

* * *

శ్రీ శంకర ప్రోక్త

# శ్రీదేవి కాలోత్తర జ్ఞానాచార విచార పటలము

\- తెలుగు అనువాదం: ముదిగొండ వీరభద్రయ్య

(గత సంచిక తరువాయి)

**43. దేవీ దేవతలు, ధర్మాధర్మములు వాటి ఫలితములు**
**ఆశ్రయాశ్రయుల తెలివిడి సంసార బంధనములు**

**44. ఆశ్రయమన్న ద్వంద్వమనియెదరు ద్వంద్వాతీతులయిన**
**జ్ఞానావాప్తియగు**
**అట్టి యోగియె జీవన్ముక్తుడు దేహానంతరమూ**
**విదేహముక్తుడు**

\- రూపమంటే ద్వైతకల్పన. అది మంచిదా అన్న ప్రశ్నకు భగవాన్ - అట్లు ప్రశ్నించే వానిని విచారమార్గం అనుసరించనీ, రూపార్చనం వానికి కాదు.

**45. వైరాగ్యమ్ము వలని శరీరత్యాగమ్ము కార్యమ్ముకాదు మనీషులకు**
**కర్మ నశించినంతనె స్వయముగ నది రాలిపోవును.**

**46. హృత్ సరోజమందహము రూపముగ చిత్తు నిర్మల మచలమ్ము**
**అహంకార పరిత్యాగమ్ముచే నాచిత్తు మోక్షదాయినియగు.**

\- జనకుడు “నన్ను ఇన్నాళ్ళబట్టి పీడిస్తున్న దొంగ దొరికాడు. అతనినింక విడిచేది లేదు” అని అన్నప్పుడు ఆయన చెప్పేది మనస్సు లేక అహంకారం గురించే.

**47. సర్వోపాధి వినిర్ముక్తమగు చిద్రూపము నెపుడును**
**‘నేనే శివుడ’ నని ధ్యానించి సర్వాసక్తి విడువగా వలయు.**

- తథ్యమైన 'అహం' ఏకమై నిలిచినప్పుడు, అది 'అహం బ్రహ్మాస్మి' అనదు. (కాని ఆ 'ఏకము' అయిన, అంటే అది తప్ప మరొకటి లేకున్న స్థితిని, శివుడనని ధ్యానించవలెనని తాత్పర్యము)

**48. దేహ జాత్యాది వర్ణాశ్రమ సమన్వితసంబంధ భావముల**
**పరిత్యజించి, స్వభావమునె సదా భావించగావలె.**

**49. నేనొక్కడనె, నా కెవరును లేరు నేనెవరి వాడ కాను**
**నన్ను తన వాడనెడి వాడెవ్వడు నగుపించడు.**

**50. నేనే పరంబ్రహ్మమును, జగన్నాథుడను**
**ఈశ్వరుడనని అనుభూతమగుచో**
**వాడె ముక్తుడు; విపరీతమగుచో బద్ధుడు.**

- నేనును కనుక్కో, 'నేను' బ్రహ్మమే. నీవట్లు యోచించినక్కర లేదు. ఊరకే అదేమో కనుక్కో.

**51. జ్ఞాన చక్షువుల చేత తన నశరీరునిగ నెపుడు చూచునో**
**నిరీహుడై అపుడతడు పూర్ణశాంతి ననుభవించు**

**52. సర్వశాస్త్రములందెవ్వడజునిగ, నీశ్వరునిగ, నశరీరునిగ**
**నిర్గుణాత్మగ తెలుపబడుచున్నాడో**
**నిస్సంశయముగ అతడె నేను - సో2హమయమస్మి**

**53. జ్ఞానమును, నిరంతర విశుద్ధుడను విముక్తుడనై సర్వత్రస్థితుడను**
**నన్నెవరిదియని నిర్ణయించగలేరు తర్కమ్ముచె దొరికెడి వాడకాను**
**శోకరహితుడనైన నేను సదాబ్రహ్మమయుడను.**

**54. శిరసు నుంచి పాద తలమ్ము వఱకు లో బయలుల నుంచి చర్మమ్ము దాక**
**సర్వమ్మును, అమృతరూపుడను - నేనె అనన్య సిద్ధమగు చిద్రూపుడను నేనె.**

- ఆధ్యాత్మిక జీవులు దేహాలు కారు; వారికి శరీరస్ఫృతే ఉండదు. వారు అవధి, ఆకృతులు లేని ఆత్మ మాత్రమే. వారిలో వారికి సర్వానికీ ఏకత ఉంది; ఏకతే కాదు, వారే సర్వమునూ.

**55. ఈ చరాచరమ్ముల కీశ్వరుడను తల్లియు తండ్రియు తాతను**
**చతుర్థ పదీయుడగు నన్నే ధ్యానింతురు మోక్షకాములు.**

- తురీయమని ఆత్మకు మరొకపేరు. జాగ్రదాది మూడవస్థలు న్నవని ఎఱిగిన మనకు తెలియనిది ఆత్మ యొక్కటే.

- ఉన్న అవస్థలు మూడు, జాగ్రత్ స్వప్నసుషుప్తులు, తురీయం నాల్గవది కాదు. పై మూటికి ఆధారమైనది. కాని ఇది సులభంగా అర్థం కాదు. అందువల్ల దానిని నాల్గవ అవస్థగా, ఏకైక సత్యంగా పరిగణించారు. నిజానికి అది దేనికీ భిన్నం కాదు. అది సర్వసంభవాలకు ఆధారం. అది ఏకైక సత్యం. నీ అస్తిత్వమే అది. అవస్థాత్రయము ఆ తురీయం మీద క్షణిక విషయములుగా నగపడి తరువాత దానిలోనే అణగిపోతవి. కాబట్టి అవి యదార్థాలు కావు.

- సినీదృశ్యంలో చిత్రాలు తెరమీది నడనీడలు. అవి తమ్ము కనిపింపజేసికొని, ముందు వెనుకలకు కదలాడి, ఒకదాని నుండి మరియొకటిగ మారి, ఎట్లెట్లో వర్తిస్తాయి. అవి కల్లలు. అంతసేపూ మారనిది ఆ సినీ తెరయే. వానిని దేనిపై ముద్రిస్తారో ఆ కేన్వాస్

నిజము. మన విషయమూ అట్లే. ప్రాపంచిక వ్యవహారాలు బాహ్యాంతరాల్లోనివి. అన్నీ తాత్కాలికములు, ఆత్మనుకాదని నిలిచేవి కావు. అవన్నీ నిజాలనీ, మనకు వెలిగానున్నవనీ అనుకొనే అలవాటు బలసిపోయి, వానిని ప్రధానులుగా ప్రదర్శించి, నిజస్వరూపాన్ని దాచివేయటం జరుగుతున్నది. సదా ఉన్నదీ, ఏకైక సత్యమూ అయిన ఆత్మను కనుగోగానే, ఈ కల్లలన్నీ కరిగిపోయి, అవన్నీ కూడా ఆత్మకు వేరుకావన్న ఎఱుక మిగిలి ఉంటుంది. (ఇక్కడ చతుర్థపదమందున్న శివుడే, ఆత్మ మోక్షకాములద్దానినే ధ్యానిస్తారని శివో2వాచ).

**56.** **బ్రహ్మాది దేవ మనుష్య నాగ గంధర్వ యక్షోప్సర గణముల చేత అనేక యజ్ఞాదుల చేత పూజ్యుడను నేను, పూజింతురు సర్వులు నన్నే.**

**57.** **ఉగ్రతపములచే వివిధ దానమ్ముల చే సర్వులు నన్నే పూజింతురు**
**స్థావర జంగమ భూతములు నేనే, ఏదియు లేదు నేను తప్ప, నన్నియు నేనే.**

- ప్రతి వ్యక్తీ చైతన్యం ఉన్నవాడే, అంటే శివుడే. అతడు శివుడు కావటమే కాదు, అతనికి తెలిసినా, తెలియకున్నా శివేతరము సర్వమూ అతడే. కాని అజ్ఞానవశుడై జగత్తును బహురూపమని తలపోస్తాడు. అతడు తనయాత్మనే చూచి ఉంటే తనకూ ప్రపంచానికీ భేదమే తెలియదు. నిజానికి, వాని వ్యక్తిత్వమూ, అనేక రూపాలుగా వ్యక్తమయ్యే ఇతరములూ అన్నీ మఱిగి పోతాయి. శివునే ప్రపంచంగా చూస్తాడు. కాని ఆ చూచువాడు

ప్రపంచానికసలు ఆధారమేమో చూడడు. సాధారణంగా వస్త్రాన్నే చూస్తారు గాని దానినిచ్చే ప్రత్తిని చూడరు. సినిమాలో కదలాడే ఛాయాచిత్రాలే చూస్తారు గాని వాని ఆధారమైన తెరను చూడరు. కాగితాన్ని చూడరు, దానిపై అక్షరాలనే గాని. కాబట్టి విషయము రూపచైతన్యముల కూడిక. సామాన్యుడు జగత్తులోని విషయాలనే చూస్తాడు. వాని ఆకృతుల్లోని శివుని చూడడు. మూలము శివుడు. అతడు తాల్చినవే ఇన్ని రూపాలూ, వానిని చూడగల్గిన చైతన్య మూను.

**58. స్థూల సూక్ష్మ శూన్యరూపుడకాను, జ్ఞానైక రూపుడ, జగదేక**
**బందుగుడ**
**నిరంతరుడ, నిర్మలుడ నీశ్వరుడ నేను,**
**స్వప్నాద్యవస్థాచ్యుతుడ నిష్ప్రపంచుడ.**

- జ్ఞానికి ఈ మూడవస్థలూ అసత్యాలే. కాని అజ్ఞానికి అది అర్థం కాదు. అతనికి మెలకువగా ఉన్న స్థితే ప్రమాణం కనుక. జ్ఞానికో, సత్యానికి ప్రమాణం సత్యమే. శుద్ధచైతన్యం యొక్క ఈ సత్యం - శాశ్వతం. అందువల్ల నువ్వు చెప్పే మూడు అవస్థలలోనూ సమానంగా ఉంటుంది. ఆ సత్యంలో ఏకమైన వానికి మనస్సే లేదు. ఆ మూడు అవస్థలూ లేవు. అందువల్ల అతనికి అంతర్ముఖ మవటం, బహిర్వర్తనమవటం కాని ఉండవు. అతను ఆత్మనే ఎప్పుడూ ఎరిగి ఉంటాడు కాబట్టి. అతనెప్పుడూ మెలకువగా ఉన్నట్లే అతనికి ప్రపంచం మళ్ళీమళ్ళీ కనబడే కలవంటిదే. అతనెప్పుడూ గాఢనిద్రలో ఉన్నట్టే--- దేహమంటూ ఉన్నదన్న ధ్యాసే ఉండదు. (సశేషం)

# అరుణాచల జ్యోతిర్గమనం

ఆంగ్ల మూలం: శ్రీ వి. గణేశన్ : “ది ఫ్లైట్ ఆఫ్ ది ఫ్లేమ్”

తెలుగు అనువాదం: వంగర శ్యామసుందరి

గమనం అంటే ఒక కదలిక. గమనం అనగా అనుభవం. గమనం అనగా కాలంలో మార్పు. దివ్యానుభవాలు దేశకాలాల లోనే సంభవిస్తాయి. కాని అవి దేశకాలాలకు అతీతమైనవి. దాదాపు అన్ని మతాల చరిత్రలలోనూ దివ్యానుభవాలకు ఉదాహరణలను గమనిస్తాము. ఆ అనుభవం పొందిన ప్రతి వ్యక్తి జీవితంలోనూ, దాని ప్రభావం ప్రస్ఫుటంగా కన్పిస్తుంది.

ఇంకొక ముఖ్య విషయమేమంటే, ఆయా పుణ్య పురుషుల జీవితాలలో ఈ అనుభవాలు ఒక మెరుపు లాగా వచ్చి వ్రాలాయి. కాని వారు వారి అనుభవాలను భావితరాలకై మాటలలో మార్చి అందించారు. వ్యక్తిత్వం నుండి దైవత్వం వైపుకు నడిచిన ఆ మహాత్ముల ప్రయాణాలను ఒకచోట కూర్చితే అదొక గొప్ప మార్మిక గ్రంథమే అవుతుంది. వాటి ద్వారానే ఎంతోమంది మహర్షులను, ఫకీర్లను గౌరవంగా గుర్తుపెట్టుకోగల్గుతున్నాము.

భగవాన్ శ్రీరమణ మహర్షి మృత్యు అనుభవం ఇలాంటిదే. 16 సం॥ వయస్సుకల ఒక పాఠశాల విద్యార్థి నిశ్చల జ్ఞానము పొందిన ఋషిగా పరివర్తనం చెందటం. అయితే ఈ ప్రయాణం వ్యక్తిత్వం నుండి దైవత్వం వైపు కాదు. దివ్యత్వమే వ్యక్తిత్వాన్ని మింగేసింది. శ్రీరమణుల మరణానుభవంలో సంభవించినది ఒకే ఒక క్రియ - అది - దివ్యత్వమే వారి వ్యక్తిత్వాన్ని నాశనం చేసింది.

అరుణాచల జ్యోతిలోని ఒక అగ్నికణం, ప్రసిద్ధిగాంచిన శైవ క్షేత్రమయిన తిరుచ్చుళిలో ధార్మిక జీవనం గడుపుతున్న ఒక ఉదార మూర్తి. అలగమ్మాళ్ లోనికి అవతరించి మానవ శరీరాన్ని ధరించింది. అలగమ్మాళ్ ధన్యురాలు. అగ్నిదేవుడు తన తల్లిగా ఆమెను ఎంచుకున్నాడు. ఆమె తన రెండవ కుమారుని గర్భంలో ధరించిన సమయంలో ఆమె అనుభవించిన వేడిని, వెలుగును అతి కష్టం మీద భరించింది. ఆ పిల్లవాని జనన సమయంలో ఒక దివ్యమైన వెలుగులో ఆ గది అంతా నిండి పోయింది. పుట్టు గ్రుడ్డి అయిన మంత్రసాని ఆ జ్యోతిని దర్శించి "అలగమ్మాళ్! వీడు దివ్యమైన శిశువు. దేదీప్యమైన వెలుగును నేను దర్శించాను" అన్నది.

ఆ శిశువే వెంకట్రామన్. అతనికి ఊహ తెల్సినప్పటి నుండి లోపల అరుణాచల నామం విన్పిస్తూండేది. అరుణాచలుడే ఈ భూమి మీద సంచరించటానికి, ఈ పిల్లవాని శరీరాన్ని వాహనంగా ఎంచుకున్నాడు. పదహారు సం॥ల పాటు, అరుణాచల నామం అతని హృదయంలో కంపనము చెందుతూనే ఉన్నది. హఠాత్తుగా ఒకరోజు అతని బంధువు నోటి నుండి ఆ నామం శబ్దంగా వెలువడింది. ఆ తర్వాత కలిగిన మరణానుభవంలో అరుణా చలుడే ఆ పిల్లవానిని తన శాశ్వతమైన కౌగిలిలో ఇముడ్చు కున్నాడు. మధురైలో జరిగిన ఈ మహత్తరమైన అనుభవంలో వెంకట్రామన్ మరణాన్ని ఎదుర్కొన్నాడు, అధిగమించాడు. మహాజ్ఞానిగా రూపొందాడు. మృత్యువు నుండి అమృతత్వానికి

జరిగిన ఈ మార్పు ఆధ్యాత్మిక చరిత్రలోనే చాలా విశిష్ఠమయినది. పూర్ణమయినది. శాశ్వతమైనది.

"మృత్యు దృశ్యం"లో, అన్ని యింద్రియాలు అచేతనమై నప్పటికీ, 'అహం స్ఫురణ' మాత్రం స్పష్టంగా తెలుస్తూనే ఉన్నది. అప్పుడు నాకు 'నేను' అంటే ఈ శరీరం కాదని, శుద్ధ చైతన్యమేనని అనుభవమయింది. 'నేను' అనే ఎరుక నాశనము లేనిది. స్వయం ప్రకాశము. ఇది దేనికి సంబందించినది కాదు. ఈ శరీరం దహింప బడినప్పటికీ 'నేను' అనే ఎరుకలో ఎటువంటి మార్పు ఉండదు. అప్పుడే 'నేను అదే' (I am that) అన్న అనుభవం కలిగింది.

జ్యోతిస్వరూపుడైన తన తండ్రికి దూరంగా, కాలిపోయిన త్రాడు వంటి తన భౌతిక శరీరానికి పరిమితమై జీవించటం, ఆ పిల్లవానికి చాల అసంతృప్తిని కలిగించింది.

ఎటువంటి ప్రయాణం అది!

మధురై నుండి తిరువణ్ణామలైకు రైలు ఛార్జి 3 రూ॥ అని తెలియకనే తనకు ఇవ్వబడిన 5 రూపాయలలో 3 రూ॥ మాత్రమే తీసుకున్నాడు. తన ప్రయాణంలో ఒక ముస్లిమ్ ఫకీరు సరైన మార్గాన్ని నిర్దేశించటం, విల్లుపురం హోటలు యజమాని, ధనం ఆశించకనే, భోజనం పెట్టటం, మాంబలం పట్టునుండి కీలూరుకు అనాయాసంగా నడవటం, సన్నాయి మేళగాడు తన ప్రసాదాన్ని వెంకట్రామన్‌కు ఇవ్వటం, భాగవతార్ గారి ప్రేమ, ఔదార్యం, అంతే కాదు ఒక మంగలి అడిగి మరీ క్షౌరం చేయటం, ఇంతలో వర్షం వచ్చి ఆయనను తడిపేయటం - ఇవన్నీ అరుణాచలేశ్వరుడు

చేతులు జాచి తన తనయుడ్ని అక్కున జేర్చుకునే క్రియలోని అంశాలే. బంధాలన్నింటి నుండీ విముక్తి పొందిన వెంకట్రామన్ తన్మయత్వంలో తన చివరి కర్తవ్యం కూడా నిర్వర్తించాడు. తండ్రి వద్దకు పరుగుపరుగున వెళ్ళి ఆయనకు సంపూర్ణ శరణాగతి చెందాడు.

శాస్త్రప్రకారం, పరివ్రాజకుడు ఒక గుడిలో, కొండ మీద గుహలో చెట్టు నీడన లేక నది ఒడ్డున తన నివాసం ఏర్పరుచుకో వచ్చును. సెప్టెంబర్ 1, 1896న బాల ఋషి అరుణాచలేశ్వర లింగాన్ని కావలించుకున్నాడు. పవిత్రమైన ఆ గర్భగుడిలో ఈశ్వరుడే కుమారుడ్ని తన శాశ్వతమైన కౌగిలిలోకి తీసుకున్నాడన్న మాట వాస్తవమేమో!

యువరమణునికి తనకంటూ ఒక ప్రత్యేకమైన చోటు అవసరం లేదు. ప్రతి అడుగూ ఆయనదే. భూతలమే ఆయన పడక. చెట్టే గొడుగు. చంద్రుడే దీపం. భిక్షాటన చేస్తేనో లేక ఎవరైనా తెచ్చి పెట్టేనో భోజనం. అది బావుందా, బాగలేదా అన్న ధ్యాస లేదు. ఏమి తింటున్నది తెలియదు. ద్వంద్వాలను ఎదుర్కొంటూ, సుఖ దుఃఖాలను అనుభవించే దేహంతో తాదాత్మ్యత అనే అపరాధం నుండి ఆయనెప్పుడో విముక్తులయ్యారు. బలంగా, దృఢంగా ఉన్న ఆ యువకుడు ఏ ఆచ్ఛాదన లేక ఒక గోవువలె బయట తిరిగే వాడు. కటిక నేల మీద శయనించటం, శుభ్రంగా రుద్దుకుని స్నానం చేయక పోవటం, కౌపీనం మాత్రమే ధరించి యున్నందున, ఆయన బ్రాహ్మణ వర్చస్సు మరుగునపడింది.

అరుణాచలం చేరిన మొదటి రోజుల్లో భగవాన్ జీవితం చూస్తే జడ భరతుని సహజనిష్ఠకు సరితూగుతుంది. బాహ్య ప్రపంచ స్మృతి లేదు. శరీర అవసరాలను తృణీకరిస్తూ, అరుణాచలేశ్వరుని దేవాలయంలో, పదహారేళ్ళ బాలుడు, అంతర్ముఖుడై జ్ఞాన నిష్ఠలో కూర్చుని ఉండేవాడు. భాగవతంలో జడభరతుని స్థితిని వివరిస్తూ 'జీవించి ఉండగానే మరణించినట్లు'గా ఉన్నదని చెప్తారు. అలాగే భగవాన్ కూడా అదే స్థితిలో 'విశ్వానికే ప్రభువుగా' సంచరించే వారు. ఇది 'అత్యాశ్రమి' అనే ఉన్నతమైన స్థితి. భగవాన్‌ని ఈ అత్యాశ్రమిస్థితిలో ఎవరైనా ఉన్నారా'' అని ఒకరు అడిగినప్పుడు భగవాన్ ''శుకమహర్షి, రిషభ దేవుడు, జడ భరతుడు ఉన్నారు'' అని చెప్పారు.

తనయుని సంపూర్ణ శరణాగతికి తండ్రి అనుగ్రహం కూడా తోడయింది. లేకపోతే పాతాళ లింగం వద్ద ధ్యాన నిష్ఠలో నున్న బాల భగవాన్‌ను దుండగుల బారి నుండి శేషాద్రిస్వామి కాపాడటం, ఇలుప్ప వృక్షం వద్ద ఉద్దండి నాయనార్ భగవాన్‌కు పూర్తి రక్షణ కల్పించటం, ఈ బాల సన్యాసికి రత్నమ్మాళ్ ఆహారం నోట్లో కుక్కటం, పళనిస్వామి కొన్ని సంవత్సరముల పాటు పితృ వాత్సల్యంతో కాపాడటం - వీటన్నింటినీ మనం ఎలా వివరించ గలము? భగవాన్ తన శరీర ధ్యాసను పూర్తిగా పరిత్యజించిన రోజులవి. ఆయన చెయ్యే ఆయనకు తలగడ, అరచెయ్యే విస్తరి. చింకి గుడ్డే ఆయన వస్త్రం. స్నానం లేదు. పానం లేదు. రాత్రి పగలు తేడా లేదు. డిశంబరు రాత్రివేళ చలికి కాళ్ళు ముడుచు

కుని తలను మోకాళ్ళ మధ్య దూర్చి కదలక పడుకునేవారు. ఉదయాన్నే మంచుపడి శరీరం మీద ఉన్న ధూళి ధవళవర్ణంలో కన్పించేది. ఆయనకు ఆకలి లేదు. దాహం లేదు. నిద్రా లేదు. మెలకువా లేదు.

1896 సెప్టెంబర్ 1 నుండి ఆ బాలసన్యాసి బ్రాహ్మణ స్వామిగా పేరు పొందేవరకు ఇదే పరిస్థితి. బ్రాహ్మణస్వామి కొన్నాళ్ళకు సాధకుల ప్రశ్నలకు వ్రాతపూర్వకంగా జవాబులు ఇచ్చేవారు. వారి జ్ఞానబోధ పద్యరూపంలో, గద్యరూపంలో వచ్చింది. స్వాత్మానుభవంలో మౌనస్థితి నుండి నెమ్మదిగా తన అనుభవాన్ని అలతి అలతి మాటలతో సూటిగా ప్రజలకు అందించే స్థితికి వచ్చారు. ఆయన భిక్షాటనకు వెళ్ళకపోతే ఆయన ఉపవసిస్తున్నారన్నారు. మాట్లాడక పోతే మౌనంగా ఉన్నారన్నారు.

సంగీత కచ్చేరిలో వేరు వేరు రాగాలలో కీర్తనలు పాడినా, షడ్జమం ఆధారశృతిగా ఉంటుంది. అలాగే భగవాన్ మౌనంగా ఉన్నా, మాట్లాడినా, ఉపవసించినా లేక ఆహారం తీసుకున్నా, సర్వకాల సర్వావస్థలలోనూ ఆత్మనిష్ఠలోనే ఉండేవారు. కర్తృత్వ భావనయే లేక, బాహ్య వ్యవహారాలన్నీ సమర్థవంతంగా నిర్వహించగల స్థితిలో ఆయన ఉండేవారు. శుద్ధచైతన్యమే మన మధ్య భగవాన్‌గా తిరిగింది. అందరిలో ఒకరిగా, అందరిలో ఎరుకగా ఆయన 54 సం॥లు జీవించారు.

భగవాన్ యిలా అంటారు. అది ఒక నిశ్చల స్థితి. జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలు దానిలో కనబడే కదలికలు. సినిమా

ప్రదర్శనలో తెరమీద కదిలే బొమ్మలవంటివి. తెరనూ, బొమ్మలనూ కలిపే చూస్తారుకాని, తెరను పట్టించుకోరు. బొమ్మలనే చూస్తారు. కాని జ్ఞాని బొమ్మలను పట్టించుకోడు. వాటికి ఆధారమైన తెరనే చూస్తాడు. బొమ్మలు తెరమీదనే కదలుతాయి. కాని తెరమీద వాటి ప్రభావం ఏమీ ఉండదు. తెర కదలదు. స్థిరంగా ఉంటుంది. అదే ప్రతి ఒక్కరి సహజస్థితి. ఒకసారి సహజ స్థితిని చేరితే దాని నుండి వైదొలగటం ఉండదు. అది శాశ్వత స్థితి. వైరాగ్యమన్నా, సన్యాసమన్నా బాహ్య ప్రపంచాన్ని వదిలి వేయటం కాదు. దానితో తాదాత్మ్యాన్ని పోగొట్టుకోవటం. తిరువణ్ణామలై చేరిన తొలిరోజుల్లో భగవాన్ తన శరీర అవసరాలను పూర్తిగా అలక్ష్యం చేశారు. కాని భగవాన్‌గా గుర్తింపబడిన తరువాత, ఆయన, వైరాగ్యం యొక్క ఇంకొక ముఖ్యమైన పార్శ్వాన్ని తెలియజేశారు. "గాఢమైన కోరికలు కలిగి ఉండటం ఎంత అహంకార లక్షణమో, తిరస్కరించుట కూడా అంతే అహంకార లక్షణము" అని.

తన సామీప్య, సౌలభ్య విషయములో భక్తులకు ఆయన ఇచ్చిన స్వేచ్ఛ, వైరాగ్యము యొక్క ఈ క్రొత్త కోణాన్ని తెలియ జేస్తుంది. ప్రతిక్షణం ప్రతిచర్య ఆయన వైరాగ్యాన్ని ప్రతిఫలించేవి. ఆయన సన్నిధిలో ప్రాణదాత అయిన ఆదిత్యుని వేడిమి, శీతాంశుని చల్లని వెలుగు మిళితమయ్యేవి.

ఇంకొక అద్భుతమైన విషయమేమంటే, అరుణాచలేశ్వరుని దేవాలయములో, గురుమూర్తంలో జరిగిన సంగతులన్నీ భగవాన్ తిరిగి చెప్పటం. వారి నిర్వికల్ప సమాధిలో తనలో తానుగా

ఉన్నప్పటికీ, బాహ్య ఘటనల యందు ఎఱుక ఉన్నది. ఈ స్థితి చాల అరుదు. ఆధ్యాత్మిక శాస్త్రంలో దీనిని సహజ సమాధి అంటారు. దేహంలో ఉంటూనే దాని పరిమితులను దాటి ఉండటం. చివరి రోజులలో భగవాన్ శరీరానికి వరుసగా శస్త్ర చికిత్సలు జరుగుతున్న సమయంలో కలిగిన తీవ్ర బాధను కూడా ఆయన లక్ష్యపెట్టలేదు. భగవాన్ బోధ అంతా అదే: దేహాత్మ భావాన్ని వదిలి శాశ్వతమైన ఆత్మగా సంస్థితమై ఉండమని.

శుకమహర్షి, జడభరతుడు, శ్రీరమణుల వంటి మహనీయులు తాము ఈ శరీరము కామని, శాంతిని వెదజల్లే శుద్ధ చైతన్య స్వరూపులమని నిరూపించారు. అరుణాచలేశ్వరుని సమక్షంలోనే తనయుడు జ్ఞాన సామ్రాజ్యానికి అధినేతగా ఉన్నాడు. నిత్యమైన సత్యము అందరికీ అందుబాటులోకి వచ్చింది. సాధకులైన మానవులకే కాదు, జంతువులకు, చెట్లకు కూడా! తిరుచ్చుళిలో మొదలైన జ్యోతి అరుణాచలం చేరి ఆయనలోనే లీనమయింది. అరుణాచలుడే రమణుడుగా కదిలి వచ్చాడు ఎందుకు? అందరినీ, ప్రతి ఒక్కరినీ, మన వంటి వారిని కూడా తన మార్గంలోకి మరల్చుటకు మనం మనమూలమైన సచ్చిదానందములో ఐక్యమయ్యేందుకు. భగవాన్ వ్రాసిన అరుణాచలాష్టకంలో యిలా అంటారు.

"ఉదధి నెగయు మేఘ మ్ముర్వి వర్షించు
నీరది మున్నీరు జేరు పర్యంత
మాపినను నిలువదటులనే దేహి
నీయందు వెలువడి నిన్జేరుదనుక"

# రమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# ఎచ్చెమ్మాళ్

శ్రీ భగవాన్ రమణమహర్షి రమణాశ్రమంలో భోజనం పెట్ట డానికేగాక, వంట చెయ్యడానికి కూడా అధిక ప్రాధాన్యతను ఇచ్చే వారు. శాంతమ్మాళ్, శంకరమ్మాళ్, సంపూర్ణమ్మాళ్ మొదలైన స్త్రీలు రమణాశ్రమంలో వంటచేసి తరించినటువంటి వాళ్ళే కాలక్రమం లో ఆశ్రమంలో మంచి వంటవసతులు ఏర్పడినా, కొంతమంది మాత్రం వాళ్ళ చివరిదశ వరకు ప్రతిరోజూ తామే స్వయంగా వండి భగవాన్ వద్దకు తెచ్చి వడ్డించేవారు. అలాంటి వాళ్ళలో ఎచ్చెమ్మాళ్ ఒకరు.

భగవాన్ వంటగది మధ్యలో ఉండి వంటపనిని పర్యవేక్షిస్తూ, తగు సూచనలు, సలహాలు ఇస్తూ వంటవాళ్ళతో కలిసి చాలా సమయం వంటపనుల్లో సహాయం చేస్తుండేవారు. దీనితో వంట గదిలో పనిచెయ్యడం అంటే భగవాన్‌తో సహజీవనం చేసినట్లేనని వంటవాళ్ళు భావించుకునేవారు. వంటకు చెందిన చిన్నచిన్న విషయాలను కూడా వేదాంతాన్ని జోడించి భగవాన్ వాళ్ళకు చెప్పే వారు. అంటే ఆత్మవిచారణకు సంబంధించిన విషయాలను వంట చేస్తున్న సమయంలోనే వాళ్ళకు బోధించేవారు. దీనితో వాళ్ళలో సంపూర్ణ పరివర్తన వచ్చేది. ఇంకా చెప్పాలంటే ఆశ్రమంలో వంట చేసే స్త్రీల పట్ల భగవాన్ కృప అపారంగా ఉండేది. అంతటి అపారమైన కృపను భగవాన్ నుంచీ పొందిన మహాత్మురాలు ఎచ్చెమ్మాళ్.

ఎచ్చెమ్మాళ్‌కు ఒకసారి స్వప్నంలో ఒక యువసాధువు కన్పించి ఆమెకు ఉపదేశం ఇచ్చారు. అదేమిటో అర్థంగాక దానిని గురించి ఆలోచిస్తున్న కొద్దిరోజుల్లోనే ఆమె భర్త, కుమారుడు, ఒక కుమార్తె మరణించడం జరిగింది. దీనితో ఆమె చాలా తల్లడిల్లింది. మరి కొద్దిరోజుల తర్వాత మరల అదే రకం స్వప్నం రావడం జరిగింది. ఈసారి ఆ స్వప్నంలో అదే యువసాధువు కన్పించి ఒక సంస్కృత మంత్రాన్ని చదివారు. అదీ ఆమెకు అర్థంగాక స్వప్నాలను గురించి విడమరచి చెప్పేవాళ్ళ వద్దకు వెళ్ళి అడగగా ఆ కలలకు అర్థం దైవానుగ్రహంగా ఆమె తెలుసుకున్నారు. ఈసారి కలలో అదే యువసాధువు కనిపించి ఆమెతో “నీ మూడు జన్మలు పూర్తయినవి” అని అనడంతో దానిని ఆమె దైవానుగ్రహంగా భావించుకున్నారు. అలా మూడుసార్లు ఆమె కలలోకి వచ్చిన ఆ యువసాధువే భగవాన్ రమణమహర్షిగా కాలాంతరంలో పోల్చుకున్నారు. ఇంకా ఆమె భగవాన్ వద్దకు రాకముందే ఆమె అనుభవించాల్సిన 3 జన్మలకు భగవాన్ పరిసమాప్తి చేశారంటే ఆమె ఎంతటి అనుగ్రహాన్ని భగవాన్ నుంచీ పొందారో తెలుసు కోవచ్చు.

మొదట్లో ఎచ్చెమ్మాళ్ తన భర్త, బిడ్డలతో కలిసి తిరువణ్ణా మలైకి సమీపంలో ఉంటుండేవారు. దురదృష్టవశాత్తు ఆమె భర్త, కుమారుడు, ఒక కుమార్తె మరణించడంతో ఆమె తన గ్రామానికి వెళ్ళిపోయారు. అక్కడికి వెళ్ళిన కొద్దిరోజులలోనే మిగిలిన ఒక్క కుమార్తె మరణించడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. ఆ

సమయంలో బంధువుల సలహా మేరకు ఎచ్చెమ్మాళ్ తిరువణ్ణా మలై వెళ్ళారు. అది 1906వ సం॥ము. అప్పుడు భగవాన్ విరూపాక్ష గుహలో ఉన్నారు. అక్కడ భగవాన్ ఆమెతో ఏమీ మాట్లాడక పోయినా వారి సన్నిధిలో కూర్చున్న వెంటనే ఆమె మనసంతా తేలికై దుఃఖం అంతా మటుమాయమయింది. ఆనాటి నుండే శ్రీ భగవాన్ ఆమెను అయస్కాంతంలా ఆకర్షించారు. ఇక ఆమె ఆనాటి నుండే తన జన్మంతా భగవాన్‌కి భిక్షనివ్వాలని మనసులో దృఢంగా భావించారు. అంతే, ఆ తరువాత ప్రతిరోజూ ఆమె భగవాన్‌కు భోజనం తీసుకుని వెళ్ళడం ప్రారంభించారు.

ఒకరోజు ఎచ్చెమ్మాళ్ మహర్షికి భోజనం పట్టుకొని కొండనెక్కు తుండగా మహర్షిని చూడలేకపోయామేనని కొందరు విచార పడతూ కొండ దిగుతుండటం గమనించారు. వెంటనే వాళ్ళని తన వెంట మహర్షి దర్శనానికి గుహ వద్దకు తీసుకెళ్ళారు. అంతే ఆ యాత్రికులు ఆ గుహలోని స్వామిని చూసి ఆశ్చర్యపోయారు. కారణం "అంతకుముందు ఒక మట్టిగోడను కడుతున్న మనిషే భగవాన్‌గా గుర్తించక కూలివారనుకొని "స్వామి ఎక్కడ?" అని అడగటం. దానికి సమాధానంగా మహర్షి "నాకు తెలియదు" అని చెప్పడం జరిగింది. యాత్రీకులు వెళ్ళిన తర్వాత అలా ఎందుకు వాళ్ళని తప్పుదారి పట్టించారని ఎచ్చెమ్మాళ్ అడగ్గా "నేనేం చేసేది? నేను రమణ మహర్షి అని అట్టమీద రాసి తలకి కట్టుకోమంటావా" అని అన్నారు. ఆమె లేశమైనా అహంకారం లేని భగవాన్ యొక్క సహజస్థితిని చూసి చలించిపోయారు.

ఆమెలో ఇంకా పిల్లలమీద మమకారం మిగిలి వుండటంతో భగవాన్ అనుమతితో చెల్లమ్మాళ్ అనే పేరుగల బాలికను దత్తత తీసుకున్నారు. కొంతకాలానికి చెల్లమ్మాళ్‌కు వివాహం జరుపగా ఒక కుమారుడు జన్మించాడు. ఆ బాలుని ఎచ్చెమ్మాళ్ భగవాన్ గుడిలో ఉంచి దీవెనలను అందుకొని రమణ అని పేరు పెట్టారు. ఇక ఎచ్చెమ్మాళ్ పెద్దదవడంతో కుమార్తె ద్వారా భగవాన్‌కు భోజనం పంపిస్తూండేవారు. దురదృష్టవశాత్తు కొంతకాలానికి చెల్లెమ్మాళ్ మరణించింది. దీనితో ఆమె విపరీతమైన కలత చెందినప్పటికీ భగవాన్ సమక్షంలో వుండటంవలన ఊరట చెంది కుదుట పడ్డారు. భగవాన్ అనుగ్రహంతో ఆత్మసాక్షాత్కారమే గమ్యంగా నిశ్చయించుకొని ఆత్మ విచారణామార్గంలో నడిచారు.

ఎచ్చెమ్మాళ్ జీవితంలో జరిగిన రెండు సంఘటనలను గమనిస్తే భగవాన్ కృప ఆమె మీద ఎంతగా వర్షించిందో మనం గమనించ వచ్చు. (1) ప్రతిదినం భగవాన్‌కు భోజనం తెస్తున్న ఆమెకు ఒకరోజు ఆశ్రమ యాజమాన్యం ఇక ఆమె భోజనం తేనవసరం లేదని అనడంతో ఆమె తీవ్ర బాధకు లోనయ్యారు. మనసులో భగవాన్ గురించి చింతిస్తూ ఇంటి దారి పట్టారు. అదే సమయంలోఆశ్రమంలో భోజనం గంట కొట్టినా ఎంతసేపటికీ భగవాన్ భోజనశాలకి వెళ్ళకపోయేసరికి ఆశ్రమ యాజమాన్యం తమ తప్పు తెలుసుకొని పరుగుపరుగునా ఎచ్చెమ్మాళ్ వద్దకు వెళ్ళి క్షమాపణ కోరారు. అంతేగాక ఆమె కారణంగా భగవాన్ భోజనం చెయ్యలేదని విన్నవించుకోగా వెంటనే ఆమె పరుగు పరుగున భగవాన్ వద్దకు వెళ్ళారు.

(2) ఒకరోజు ఆమె ఆశ్రమానికి వెళ్ళలేక భోజనాన్ని వేరొకరితో పంపారు. అక్కడివాళ్ళు దానిని వంటశాలలో పెట్టి భగవాన్‌కు వడ్డించడం మరచిపోయారు. ఇది గమనించిన భగవాన్ భోం చేయకుండా అలాగే మౌనంగా కూర్చున్నారు. దీనిని గమనించిన ఒక సేవకుడు వెంటనే ఎచ్చెమ్మాళ్ తెచ్చిన భోజనాన్ని వడ్డించగా అప్పుడు భగవాన్ భోజనం చేశారు.

ఎచ్చెమ్మాళ్ చివరిదశలో రెండురోజులు స్పృహలో లేరు. ఆమె ఆత్మలో స్థిరపడిపోవడమే దానికి కారణం. ఈ విషయం తెలియని డాక్టర్లు, ఆమె కోమాలోకి వెళ్ళిపోయిందనుకున్నారు. ఆ స్థితిలో ఆమె చుట్టు ఉన్న స్త్రీలు ఆమెను పరీక్షించాలనుకొని అందులో ఒకరు పెద్ద గొంతుతో "ఏమిటీ భగవాన్‌కు ఇంకా భోజనం పంపినట్లు లేదే?" అని అన్నారు. వెంటనే ఆమె కళ్ళు తెరచి పెద్దవిగా చేసికొని ఏమయింది? అన్నట్లుగా చూశారు. వెంటనే ఆ స్త్రీలు "ఏమీ కాలేదు హాస్యానికి అన్నాము. భగవాన్‌కు ఇందాకే భోజనం పంపేశారు" అని జవాబిచ్చారు. ఆ మాటలు విన్న వెంటనే ఆమె కనులు మూసుకొని చిరునవ్వుతో ఆనందంగా శరీరాన్ని వదిలేశారు. ఈ విషయం తెలిసిన భగవాన్ "ఎచ్చెమ్మాళ్ తన భారాన్ని వదిలించుకొంది, కానీ నా భారం ఇంకా మిగిలి ఉంది" అని అన్నారు. అలాగ భగవాన్ యొక్క అపారమైన అనుగ్రహాన్ని ఎచ్చెమ్మాళ్ సొంతం చేసుకొని తరించారు.

(ఆధారం: శ్రీరమణమహర్షితో ముఖాముఖి, శ్రీరమణభక్త విజయం)

\- శ్రీమతికాట్రావులపల్లి సుబ్బలక్ష్మి

# Bhagavan Ramana: His Silent *Upadesa* (Part-1)

Arthur Osborne

It is surprising how secret was the *upadesa* of Sri Bhagavan, that is to say the guidance or instruction he gave to his disciples — there is no exact English translation of the word. Although he was accessible to all alike, although questions were normally asked and answered in public, the guidance given to each disciple was nevertheless intensely direct and adapted to his character. When asked once by Swami Yogananda, a Swami with a large following in America, what spiritual instruction should be given to the people for their uplift, he replied, "It depends on the temperament and spiritual maturity of the individual. There can be no mass instruction". It is enough to recall the stories of four devotees already referred to — Echammal, the Mother, Sivaprakasam Pillai and Natesa Mudaliar — to realize how enormously the treatment varied.

Sri Bhagavan was intensely active — he himself has said so, though none who experienced his Grace needed any confirmation — and yet so concealed was his activity that casual visitors and those who failed to perceive believed that he gave no upadesa at all or that he was indifferent to the needs of seekers. There were many such, like the Brahmin who tried to dissuade Natesa Mudaliar from visiting him.

The extreme importance of this question lies in the fact that (except in the rarest of cases, such as that of Sri Bhagavan himself) Realization is possible only through the Grace of a guru. Sri Bhagavan was as definite about this as other Masters.

Therefore it was not enough for the *sadhaka* (aspirant) to know that his teaching was sublime and his presence inspiring; it was necessary to know that he was a *guru* giving *diksha* (initiation) and *upadesa* (instruction).

The term *'Guru'* is used in three senses. It can mean one who, although he has no spiritual attainment, has been invested (like the ordination of a priest) with the right to give initiation and upadesa. He is often hereditary and is not unlike a family doctor for spiritual health. Secondly, the *guru* can be one who, in addition to the above, has some spiritual attainment and can guide his disciples by more potent upadesa (even though the actual practices enjoined may be the same) as far as he himself has gone. But in the highest and truest meaning of the word, the guru is he who has realized Oneness with the Spirit that is the Self of all. This is the Sat-guru.

It is in this last sense that Sri Bhagavan used the word. Therefore he said, "God, guru and Self are the same". And in describing the guru he said (in *Spiritual Instructions):*

The *guru* is one who at all times abides in the profound depths of the Self. He never sees any difference between himself and others and he is completely free from false notions of distinction that he himself is the Enlightened or the Liberated while others around him are in bondage or the darkness of ignorance. His firmness or self-possession can never be shaken under any circumstances and he is never perturbed.

Submission to this guru is not submission to any outside oneself but to the Self manifested outwardly in order to help one discover the Self within. "The Master is within; meditation

is meant to remove the ignorant idea that he is only outside. If he were a stranger whom you were awaiting he would be bound to disappear also. What would be the use of a transient being like that? But as long as you think that you are separate or are the body, so long is the outer Master also necessary and he will appear as if with a body. When the wrong identification of oneself with the body ceases, the Master is found to be none other than the Self'.

It is axiomatic that one who is a *guru* in this supreme sense of having realized his identity with the Absolute does not say so, inasmuch as there is no ego left to affirm the identity. Also he does not say that he has disciples, for, being beyond otherness, there can be no relationship for him.

